క్లుప్తంగా

హైస్కూల్ అభివృద్ధికి వితరణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాదాత, సంఘ సంస్కర్త విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన పింగళి సూర్యనారాయణ శత జయంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు గొల్లపూడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో శనివారం వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సూర్యనారాయణ కుమారులు పింగళి అశ్వర్థ నారాయణ–లలిత, పింగళి శ్రీరాములు – రమ దంపతులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విద్యా అకాడమీ హైస్కూల్ అభివృద్ధికి రూ.50 వేల చెక్కును స్కూల్ యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో పింగళి సూర్యనారాయణ కుటుంబ సభ్యులు పింగళి ప్రమీల, గొల్లపూడి భాగ్యలక్ష్మి, కానుకొలను రోహిణి, పాఠశాల కరస్పాండెంట్ ఆర్.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆర్.గోపాలం, సెక్రటరీ నరసింహం, కమిటీ సభ్యుడు ఎం.సంగీతరావు పాల్గొన్నారు.

అసత్య కథనాలపై రైతుల ఆగ్రహం

ఇబ్రహీంపట్నం: కొండపల్లి బీఎస్‌ఆర్ ఆగ్రో రైస్‌మిల్ యజమాని రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వాల్సి ఉండగా రాజకీయ నాయకులు రైతుల సొమ్ము దోచారని ఓ పత్రిక అసత్య కథనాలు రాయడంపై రైతులు మండిపడ్డారు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పచ్చపత్రిక రాతలను రైతులు ఖండించారు. సర్పంచ్ వేముల సీతారామయ్య మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో 24 గ్రామాల నుంచి గతేడాది డిసెంబర్ 24 వరకు 1.40 లక్షల టిక్కీల ధాన్యం బీఎస్‌ఆర్ ఆగ్రో రైస్ మిల్లుకు దశలవారీగా తరలించారన్నారు. జనవరి 12 లోపు ధాన్యం పంపిన రైతులకు ప్రభుత్వం నగదు జమచేసిందన్నారు. బీఎస్‌ఆర్ ఆగ్రో రైస్‌మిల్లు అనుమతుల్లో కొద్దిపాటి లోపాలతో రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదని, ఈ విషయం గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి విషయం తీసుకువెళ్లగా వారు కలెక్టర్, జేసీ, సివిల్ సప్లయ్ అధికారులకు సమస్య వివరించి ధాన్యం డబ్బులు జమ చేయాలని ఆదేశించారని చెప్పారు. మరో వారం రోజుల్లో నగదు జమ కానున్న తరుణంలో మాజీ మంత్రి దేవినేని ఉమా సూచనలతో పార్టీ నేతలపై అసత్య కథనాలు రాయడాన్ని పీపీఎస్ చైర్మన్ సాంబశివరావు తీవ్రంగా ఖండించారు.

21న భవానీద్వీపంలో మాతృభాషా దినోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 21న ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు, సంస్కృత అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో భవానీ ద్వీపం నందు హంపి థియేటర్‌లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం వ్యవస్థాపకులు పీవీఎల్ఎన్ రాజు(అబ్బు) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖామంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్ పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. శాసన పరిశోధకులు, చారిత్రక రచయితలను సత్కరిస్తామని చెప్పారు. తెలుగు జాతీయులు, తెలుగు భాషాభిమానులు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ కనకదుర్గా నృత్య మందిర్‌కు చెందిన ఎంఎన్ఎస్.భార్గవి, జె.కనిష్క, బి.నయోనిక, పి.జ్ఞానసమన్విత, డి.ఉన్మేష, కె.కావ్యలతో పాటు మరి కొంత మంది తమ నృత్య ప్రతిభను ప్రదర్శించారు. అమ్మవారి పంచహారతుల అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో కళాకారులకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

స్టెల్లాలో ఎన్‌సీసీ ప్రాక్టికల్స్

పటమట(విజయవాడతూర్పు): స్టెల్లాలో ఎన్‌సీసీ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు నగరానికి చెందిన వివిధ కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు డ్రిల్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ పరీక్షలకు హాజరయ్యారు. ఈ పరీక్షలకు ప్రిసీడింగ్ అధికారులుగా లెఫ్టినెంట్ కర్నల్ తన్వీర్, కర్నల్ సౌరభ్ ముఖర్జీ, కర్నల్ సురేంద్రన్ వ్యవహరించారు. 500 మంది కేడెట్లు పరీక్షలకు హాజరయ్యారు.

శైవక్షేత్రాల్లో మార్మోగిన శివనామస్మరణ



వన్‌టౌన్ పాతశివాలయంలో ఎమ్మెల్యే వెలంపల్లి విశేష పూజలు

- శివయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పాతబస్తీలో కిటకిటలాడిన ఆలయాలు
- అర్ధరాత్రి స్వామివారి కల్యాణోత్సవాలు
- పాతశివాలయంలో స్వామివారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం వన్‌టౌన్‌లోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పరమ శివుని దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. హరహర మహాదేవా శంభోశంకర నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. తెల్లవారుజాము నుంచి ఆయా ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, బిల్వార్చనలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్రనామార్చనలు, వేద పఠనాలు ఇలా వివిధ కార్యక్రమాలతో ఆలయాలు కనువిందు చేశాయి. భక్తుల రద్దీ రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఆలయ పరిసరాల్లో రుత్విక్కులకు పితృదేవతలను స్మరించుకుంటూ దానాలు చేశారు.

పాత శివాలయంలో..

వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో (పాతశివాలయం) తెల్లవారుజామున రెండు గంటలకు భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. అనంతరం భక్తులు అభిషేకార్చనకు బారులు తీరారు. ధర్మరాజు ప్రతిష్ఠతమైన ఈ ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ స్వామి వారికి అభిషేకాలు కొనసాగాయి. సుమారు 12 గంటల పాటు నిర్విరామంగా భక్తులు రద్దీ కొనసాగింది. అదేవిధంగా స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు. అలాగే వివిధ ఫల, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాన్ని నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కాలం తరువాత స్వామి వారి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఎస్.హేమలతాదేవి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లోనూ భక్తులు పోటెత్తారు. ప్రధానంగా అయ్యప్పస్వామి సన్నిధిలో, భ్రమరాంబ అమ్మవారి సన్నిధిలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఇతర ఆలయాల్లో..

వన్‌టౌన్ భక్తులతో కిటకిటలాడింది. స్థానిక విజయేశ్వరస్వామి వారి ఆలయం, శ్రీ కన్యకాపరమేశ్వరి నగరేశ్వరస్వామి వారి దేవస్థానం(కొత్త గుళ్లు), కేటీరోడ్డులోని శ్రీ గంగానమ్మ దేవస్థానం ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి వార్ల దేవస్థానం, పంజా సెంటర్ సమీపంలో ఉన్న హనుమాన్ ఆలయంలో కొలువుదీరిన కాశీ విశ్వేశ్వరస్వామి వారి సన్నిధి, సైకంవారివీధిలో వేంచేసి ఉన్న శ్రీ దర్వేశ్వరస్వామి వారి దేవస్థానం తదితర ఆలయాలు భక్తుల రద్దీ నెలకొంది. ప్రత్యేక పూజలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని చేపట్టారు. విజయేశ్వరస్వామివారిని ఎమ్మెల్యే వెలంపల్లి కుటుంబ సభ్యులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయంలోని స్వామివారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు విశేష పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి రాత్రి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీల ప్రముఖులు పర్యవేక్షించారు.

చిట్టినగర్ వ్యాప్తంగా..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని పలు ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు స్వామి వారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ రావూరి వెంకటేశ్వరరావు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి తెల్లవారుజాము 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. స్వామి వారిని కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, 46వ డివిజన్ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం స్వామివారికి అభిషేకాలు, రాత్రి 7 గంటలకు ఎదురుకోల ఉత్సవం, అనంతరం విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు కల్యాణోత్సవాన్ని జరిపించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలోని శమీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామి వారికి తెల్లవారుజాము నుంచే భక్తులు విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో దీపార్చన, కల్యాణోత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హనుమత్ దీక్షాపీఠంలో శివ కల్యాణం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రిని పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీ హనుమత్ దీక్షాపీఠంలో లలితా గౌరీ నాగలింగేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. తొలుత పీఠంలోని అభయ వీరాంజనేయ స్వామి, నాగలింగేశ్వర స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు లలితా గౌరీ నాగలింగేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులకు కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణోత్సవంలో పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద పంపిణీ జరిగింది.



విజయేశ్వరస్వామి సన్నిధిలో విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు



వాగు సెంటర్‌లో దర్శనమిస్తున్న మల్లికార్జునస్వామి



రామలింగేశ్వర స్వామికి కార్పొరేటర్ రాజేష్, రజనీకుమార్ ప్రత్యేక పూజలు



పాతశివాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కృష్ణానది తీరాన పూజలు చేస్తున్న భక్తులు



ప్రకాశం బ్యారేజీ వద్ద పిండప్రదానాలు చేస్తున్న భక్తజనం

అన్నదానాలు అభినందనీయం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి



ప్రసాద వితరణ చేస్తున్న జగన్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాశివరాత్రిని పురస్కరించుకొని పాతబస్తీలో పలు సంస్థలు అన్నదానాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రథం సెంటర్ వద్ద దేవదాయ శాఖకు చెందిన చల్లంరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు దుర్గాఘాట్‌లో స్నానమాచరించటం, ఇక్కడ ఉన్న పురాతన పుణ్యక్షేత్రాల్లో దర్శనం చేసుకోవటం ఆనావాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, చైర్మన్ వాసా బాబు(ఆదినారాయణ), సభ్యులు పొట్నూరి రాజా, శంకర్, దుర్గాప్రసాద్, అశోక్, లక్ష్మీపావని, సుగుణ పాల్గొన్నారు.

నగరాలు అన్నదాన వసతి సత్రం కమిటీ

శ్రీశైల క్షేత్ర భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి నగరాలు కులస్తుల నిత్యాన్నదాన వసతి సత్రం కమిటీ ఆధ్వర్యంలో కొత్తపేటలోని శ్రీనగరాల సీతారామస్వామి దేవస్థానం వద్ద ప్రసాదాల పంపిణీ, అన్న ప్రసాద వితరణ చేశారు. కమిటీ ప్రధాన కార్యదర్శి కొరగంజి జగన్ మాట్లాడుతూ అన్నదానం చేయటం స్వామి వారికి విశేషమైన ప్రీతినిస్తుందన్నారు. శ్రీశైలం పుణ్యక్షేత్రంలో తమ కమిటీ తరపున నిత్య అన్నదాన వసతి సత్రం నిర్మాణ పనులను ప్రారంభించామని, పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కమిటీ అధ్యక్షుడు నల్లాన సూర్యారావు, పిళ్లా మోహనరావు, పణుకు రమేష్, బెవర సూర్యనారాయణ, జగుపిళ్ల మహేష్, గుజ్జారి అమర్, లింగిపిల్లి రామకృష్ణ ఉన్నారు.

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి నేపథ్యంలో పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రికి చేరుకుని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కొనసాగగా, మధ్యాహ్నం మహా నివేదన అనంతరం మరింత భక్తుల రద్దీ పెరిగింది. కళాశాలలకు వరస సెలవుల కావడంతో విద్యార్థులు స్నేహితులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహా శివరాత్రి నేపథ్యంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఆలయ ప్రాంగణంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు మల్లేశ్వరాలయం, మహా మండపం, ఘాట్‌రోడ్డు, కనకదుర్గనగర్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ప్రధాన ఆలయాన్ని శనివారం ఆలయ అర్చకులు తెరిచి పూజా కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయాభివృద్ధి పనులు జరుగుతున్న సంగతి విదితమే. పనుల నిమిత్తం స్వామి వారి ఆలయాన్ని కొన్ని నెలలుగా మూసివేయగా, మహా శివరాత్రి నేపథ్యంలో ఆలయ ద్వారాలు తెరిచి స్వామి వారికి పూజా కార్యక్రమాలను నిర్వహించిన పిమ్మట భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని బాలాలయంలో స్వామి వారికి త్రికాల అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తజనం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా శివరాత్రి పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తజనంతో కృష్ణానది తీరంలోని స్నానఘాట్లు కిటకిటలాడాయి. దుర్గాఘాట్ తెల్లవారుజామున 3 గంటల నుంచే భక్తులు పుణ్యస్నానాలకు తరలివచ్చారు. ప్రకాశం బ్యారేజీ నుంచి దుర్గాఘాట్ వరకు భక్తులు బారులు తీరి కనిపించారు. స్నానఘాట్‌లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దుర్గగుడి అధికారులు మైక్ ప్రచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ఆరు గంటల నుంచి పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల సంఖ్య మరింత పెరిగింది. దీంతో స్నానఘాట్‌లోకి భక్తులను పరిమిత సంఖ్యలో అనుమతిస్తూ రద్దీని నియంత్రించారు. మరో వైపున స్నానఘాట్ ప్రధాన గేటు నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండేందుకు కంపార్టుమెంట్ పద్ధతిని పోలీసులు అనుసరించారు. పుణ్యస్నానాలకు విచ్చేసిన భక్తుల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. నదీతీర ప్రాంతాల్లో పిండ ప్రదానాలు, బంగన్న దొరల సందడి కనిపించింది. పలువురు ప్రముఖులు, నగర వాసులు పితృదేవతలకు పిండప్రదానం చేశారు.

పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు పాత శివాలయం, బుద్దా వారి గుడి, విజయేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిపించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయాల్లో క్యూలైన్లు కిటకిటలాడాయి.

ఉత్తమ ఫలితాల సాధనలో చేతిరాత కీలకం

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసిన జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల విద్యాభివృద్ధికి, ఉత్తమ ఫలితాల సాధనలో చేతిరాతే కీలకమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి చేతిరాతపై పట్టు సాధించేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాతలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోనున్నామని కలెక్టర్ తెలిపారు. హ్యాండ్ రైటింగ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శనివారం ఆయన కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేతిరాత నిపుణుడు భువనచంద్ర సహకారంతో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు సంబంధించి ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 170 మంది విద్యార్థులు పాల్గొనగా ఉన్నత స్థాయిలో ఎస్.జీవితేష్, అవ్యక్తా, ప్రద్యుమ్నా పూజారి ప్రాథమిక స్థాయిలో జి.జ్ఞాన శ్రీనిధి లు చాంపియన్ షిప్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. జాతీయ చేతిరాత నిపుణుడు పి.భువనచంద్ర, అమలి, శుభోదయ పాఠశాలల ప్రిన్సిపాల్స్ వై.రాజకుమారి, బి.శైలజ, అధ్యాపకులు సీహెచ్.నళిని, ఎం.శ్యామ్ కుమార్, ఎం.కె.ఎస్తేరు, పద్మజ్యోతి, ఎ.భావన, జి.జ్ఞానేశ్వరి, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కెనాల్‌రోడ్డులో రథోత్సవం

153 ఏళ్లుగా నిర్వహణ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జరిగే మల్లేశ్వరుని రథోత్సవం నగరానికి తలమానికంగా నిలుస్తోంది. కేవలం నగర వాసులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలివస్తుంటారు. ఈ రథోత్సవంలో మూడు ఆలయాలకు చెందిన ఉత్సవ మూర్తులు కెనాల్ రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తుంటారు. దుర్గగుడి, పాత శివాలయం బుద్ధువారి గుడిలకు చెందిన ఉత్సవమూర్తులను ఈ రథంపై అధిష్ఠింపజేస్తారు. శ్రీకన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ గడిచిన 153 సంవత్సరాలుగా ఈ రథోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. వన్‌టౌన్ రహదారులన్నీ జాతరను తలపించే విధంగా దుకాణాలతో దర్శనమిస్తాయి. ప్రధానంగా గ్రామాల్లో జరిగే తిరునాళ్లు, సంత వాతావరణాన్ని ఈ రథోత్సవం ఆవిష్కరిస్తుంది. ఈ ఏడాది మరింత దేదీప్యమానంగా రథోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కెనాల్‌రోడ్డులో భక్తులకు కనువిందు

దుర్గగుడి, బుద్ధ వారి గుడి, పాతశివాలయానికి పూర్వం ఆర్థిక వనరులు ఉండేవి కావు. ఆ సమయంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అన్నసత్రం కమిటీ శివరాత్రి ఉత్సవాలను నిర్వహించేవారు. ఆ తరువాత ఈ మూడు ఆలయాలకు సంబంధించిన ఉత్సవ మూర్తులతో రథోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆ కమిటీ ప్రముఖులు చెబుతున్నారు. అయితే నేడు దుర్గగుడికి ఆదాయ వనరులు పెరగటంతో మూడున్నర దశాబ్దాలుగా దుర్గగుడి అధికారులే కొండపైన కల్యాణోత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే పాతశివాలయంలో ఇప్పటికీ కన్యకాపరమేశ్వరి అన్నసత్రం కమిటీ ఆధ్వర్యంలోనే కల్యాణోత్సవాలు కొనసాగుతున్నాయి. రథోత్సవంలో మాత్రం మూడు ఆలయాల ఉత్సవమూర్తులు ఊరేగుతున్నాయి. కెనాల్‌రోడ్డులోని రథం సెంటర్ నుంచి ఆదివారం సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించేందుకు కమిటీ ప్రముఖులు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ కమిషనరేట్ పోలీసు కమిషనర్ కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించడం కూడా రెండు దశాబ్దాలుగా కొనసాగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. అలాగే పలు జాదపద కళాకారుల విన్యాసాలతో, వేద పండితుల మంత్రోచ్చరణలతో ఆదిదంపతులు కృష్ణానది ఒడ్డున ఉన్న కెనాల్‌రోడ్డులో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేయనున్నారు.

వైవీ రావు మృతి తీరని లోటు



వైవీ రావు పాడె మోస్తున్న ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఆర్టీసీ కార్మిక నేత వైవీ రావు మృతి తీరని లోటని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శుక్రవారం రాత్రి హఠాన్మరణం చెందిన వైవీ రావు కుటుంబాన్ని శనివారం ఎండీ పరామర్శించి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వ్యక్తి వైవీ రావు అన్నారు. కార్మికుల సమస్యల పట్ల ఏమాత్రం రాజీ పడే వారు కాదన్నారు. సంస్థ ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత కూడా ఉద్యోగులకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేశారన్నారు. అనంతరం వైవీ రావు అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్నారు.